క్లుప్తంగా

నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలతో విద్యార్థులు

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ రేగా, కరకవలస, కొత్తవలస గ్రామాల్లోని పాఠశాలల్లోని పేద విద్యార్థులకు దాతల సాయంతో సమకూర్చిన నోటు పుస్తకాలు, స్టేషనరీ తదితర సామగ్రిని సర్పంచ్ చినబాబు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు



బొంగరాలపాడు వంతెన వద్ద తుప్పలు తొలగిస్తున్న గ్రామస్తులు

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురం–బొంగరాలపాడు మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగి ఉన్న తుప్పలను గ్రామస్తులు శ్రమదానంతో తొలగించారు. తుప్పలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు కలిసి జంగిల్ క్లియరెన్స్ పనులు సోమవారం చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ



డస్ట్‌బిన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: మండలంలో బస్కీ పంచాయతీ కేంద్రంలో సోమవారం సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్నలు కలిసి 1060 డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ అందిస్తున్న ఈ డస్‌బిన్‌లలో తడి, పొడి చెత్తలను వేర్వేరు వేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో బాపన్నదొర అధ్యక్షతన సచివాలయాల సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, ఈవోపీఆర్‌డీ డి శివకుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతు, సచివాలయాల సిబ్బంది ప్రతీ ఒక్కరు పారదర్శకతతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఓడీఎఫ్ సర్వేను వేగవంతం చేయాలని, గ్రామాల్లో శానిటేషన్ పనులు చేయించాలని, గ్రీవెన్ నిర్వహించాలని ఆదేశించారు. చెక్‌డ్యామ్‌ల రిపేర్ల వివరాలను అందజేయాలన్నారు.

సర్పంచ్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్ బాగుచేస్తున్న సర్పంచ్ కామరాజు

గంగవరం : కొత్తాడ పునరావాస కాలనీలోని ఓ వీధిలో గత ఐదు రోజులుగా కుళాయిలకు నీరు రాకపోవడంతో స్థానిక మహిళలు సర్పంచ్ కామరాజు దొర దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి ట్యాంక్ నుంచి వీధి కుళాయిలకు సరఫరా అయ్యే పైపు లీకులను గుర్తించారు. తక్షణమే ఆ పైపులైను ఆయనే శ్రమదానంతో రిపేరు చేశారు. తాగునీరు సరఫరా అయ్యేలా చూశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పసుపు సిరులు

- మార్కెట్‌లో డిమాండ్
- పెరిగిన సాగు విస్తీర్ణం
- ఏటా పెరుగుతున్న ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు



పసుపు కొమ్ముల సేకరణలో గిరిజన రైతులు(ఫైల్)



బల్లుగూడ గ్రామంలో సాగుచేస్తున్న పసుపు

ముంచంగిపుట్టు: మన్యం పసుపు నాణ్యత బాగుండడంతో రాష్ట్ర నలుమూలలకు వ్యాపారం జరుగుతుంది. ఏజెన్సీ వాతావరణం, భూసారం అనుకూలంగా ఉండడంతో పసుపు దిగుబడి బాగుంటుంది. దీంతో పాటు సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో మంచి నాణ్యత ఉంటుంది. మన్యంలో చాలా చోట్ల ఏటా రెండు పంటలుగా పసుపు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో మన్యం పసుపునకు డిమాండ్ ఉంది. ఏటా ధరలు పెరుగుతున్నాయి. దీంతో గిరిజన రైతులు సాగు విస్తీర్ణం పెంచుతున్నారు.

మైదాన ప్రాంతాలకు తరలింపు

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో పసుపు పంట సాగు విస్తారంగా గిరిజనులు చేపడుతున్నారు. గత ఏడాది పసుపు ధర ఆశించిన స్థాయిలో ఉండడంతో ఈ ఏడాది పసుపు పంట సాగుపై గిరిజనులు అధిక దృష్టి పెట్టారు. ప్రతి గ్రామంలోను ఇళ్లకు సమీపంలో పసుపు పంట గిరిజనులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతానికి పసుపు పంట దిగుబడి బాగా ఉంది. గత ఏడాది కిలో రూ.150 నుంచి రూ.160ల వరకు ధర పలికింది. మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వారపు సంతలో వ్యాపారం జోరుగా జరుగుతుంది. అయితే ఈ ఏడాది ప్రభుత్వం పంట సాగునకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు చేసి పంట వేసినట్టు రైతులు చెబుతున్నారు. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసాతో పెట్టుబడి సాయం సీజన్‌కు ముందుగానే అందించడంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా పోయాయని రైతులు చెబుతున్నారు.గతేడాది 641 హెక్టార్లలో పసుపు సాగు ఉండగా, ఈ ఏడాది 1050 హెక్టార్లకు పెరిగింది. మండలంలోని కర్రిముఖిపుట్టు, బాబుశాల, కుమడ, పనసపుట్టు, సుజనకోట, పెదగూడ, కిలగాడ పంచాయతీల్లో పసుపు పంట విస్తీర్ణం గత రెండేళ్లుగా బాగా పెరిగింది. ముంచంగిపుట్టు మండలంలో ఈ ఏడాది 1050 హెక్టార్లలో 1700 మంది గిరిజన రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు, బూసిపుట్టు, లక్ష్మీపురం, ముంచంగిపుట్టు వారపు సంతల్లో ఎక్కువగా పసుపు వ్యాపారం జరుగుతుంది. పెదబయలు మండలంలోని వారపు సంతలో వ్యాపారం జరుగుతుంది.

పసుపు సాగు విధానం

ప్రత్యామ్నాయ పంటగా పసుపును గిరిజనులు సాగు చేస్తుంటారు. ఎకరా పొలంలో ఐదు కావిళ్ల వరకు పసుపు విత్తనాలు వేస్తే 10 నుంచి 15 బస్తాలకు పైగా దిగుబడి వస్తుందని గిరి రైతులు చెబుతున్నారు. మొక్కలు ఏపుగా పెరగడానికి తరుచూ కలుపు నివారణ చర్యలు చేపడతామని, వర్షపాతం తగినంత ఉంటే ఏడాదిలో రెండుసార్లు పసుపును దుంపలను తవ్వుకోవచ్చని పేర్కొంటున్నారు. అక్టోబర్ నెలలో విజయదశమి పండగా వచ్చేసరికి తొలివిడుత దిగుబడి వస్తుంది. పసుపు దుంపలు, కొమ్ములు రూపంలో వారపు సంతలో అమ్మకాలు చేస్తామని రైతులు తెలిపారు. రెండో పంటగా జనవరిలో వేస్తామని చెబుతున్నారు. మంచి దిగుబడి రావడానికి ఐదు నెలలు పడుతుందని, ఇందుకు వాతావరణం కూడా అనుకూలించాలని చెబుతున్నారు. ఏజన్సీ పసుపు ప్రత్యేక నాణ్యత ఉండడంతో విశాఖపట్నం, విజయవాడ, వి.మాడుగులలతో పాటు ఒడిశా నుంచి సైతం వ్యాపారులు వారపు సంతలకు వచ్చి కొనుగోలు చేస్తుంటారని రైతులు చెబుతున్నారు. వారపు సంతల్లో దళారులు బెడదతో ధరల్లో వ్యత్యాసాలు ఉండి ఒక్కోసారి నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపును జీసీసీ కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా ధరలు



పసుపునకు ఏటా డిమాండ్ పెరుగుతుంది. మైదాన ప్రాంత మార్కెట్‌లో గిరాకీ ఉంది. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తుండడంతో మంచి నాణ్యత, దిగుబడి ఎక్కువగా ఉంటుంది. సంతల్లో ఆశాజనకంగా ధరలు పలుకుతున్నాయి. జీసీసీ కొనుగోలు చేస్తే బాగుంటుంది.

– వి.మల్లేశ్వరరావు, రైతు, ముంచంగిపుట్టు

సాగుపై సూచనలు



రైతులకు పంటల సాగుపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పసుపు సాగులో ఎటువంటి తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులకు తెలియజేస్తున్నారు. పంటకు వాతావరణం అనుకూలంగా ఉంది.

– ఎ.శ్రీనివాస్ బాబు, ఏవో, ముంచంగిపుట్టు

అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలపై అవగాహన

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి సూచనల మేరకు కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.రమణ, డాక్టర్ కేజియా మాట్లాడుతూ వ్యాపార వాణిజ్యంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదసాయం కోసం వినతి

వీఆర్ పురం (చింతూరు): వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులకు కూడా వరదసాయం రూ 3వేలు ఇవ్వాలని వీఆర్ పురం సీపీఎం మండల కమిటీ సోమవారం తహసీల్దార్ సయ్యద్ ఫాజిల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వరదలకు మండలంలోని ఉద్యోగుల ఇళ్లు కూడా నీట మునిగి అనేక ఇబ్బందులు పడ్డారని వారికి కూడా వరద బాధితులకు అందించిన విధంగానే పరిహారం అందచేయాలని కోరారు. ఎంపీపీ కారం లక్ష్మి, మండల పార్టీ కార్యదర్శి చినబాబు, సత్యనారాయణ తదితరులున్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

గంగవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లా కృష్ణారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు , సర్పంచ్‌లు మండల పరిషత్ పాలక మండలి సభ్యులందరూ హాజరుకావాలన్నారు.

పాఠశాల పరిశీలన



టొంగికోటలో కూలిన పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ టొంగికోటలో ఇటీవల కూలిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ఎంపీడీవో కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థుల తల్లిదండ్రులు నిర్మించిన తాత్కాలిక పాకలో పాఠశాల నిర్వహణ జరుగుతుండడంతో దానిని ఆయన పరిశీలించి, తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం పెదగూడ పంచాయతీ బాకుబెడలో జీటీఎస్ డబ్ల్యూ పాఠశాలకు భవనం లేక పాకలో నిర్వహిస్తున్న తరగతులు, విద్యార్థుల అవస్థలను తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల భవనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామన్నారు. సర్పంచ్ లక్ష్మణ్, ఎంఈవో కృష్ణమూర్తి, పిఆర్ ఏఈ గోపాలకృష్ణ, సీఆర్‌పీ అనిల్, ఉపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



గూడెంకొత్తవీధిలో ఫాగింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి/డుంబ్రిగుడ/చింతపల్లి: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జీకే వీధి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఫాగింగ్ పనులను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పెదవలస పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్‌శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలం ఇసుకగరువులో దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపట్టారు. డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈవో సారీ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో కళాశాల ఎదురుగా డంపింగ్ యార్డు వల్ల వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని విద్యార్థులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతి పత్రం అందజేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది



అరకులోయలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏఎన్‌ఎం పాప్పయమ్మ



కొయ్యూరులో అంగన్‌వాడీ సిబ్బంది మానవహారం



కర్రిముఖిపుట్టులోని ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



గంగవరంలో గర్భిణికి సీమంతంచేస్తున్న సీడీపీవో లక్ష్మి తదితరులు

పాడేరు/అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/కొయ్యూరు/గంగవరం: జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఈ సందర్భంగా వైద్యులు, సీడీపీవోల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, ఎటువంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. శిశువుకు రోగ నిరోధక శక్తి పెంచుతుందన్నారు. పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు అందజేయాలని సూచించారు. పలుచోట్ల సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవోలు ఝాన్సీ రాణి, లక్ష్మి, విజయకుమారి, సూపర్‌వైజర్లు ఊర్మిళరెడ్డి, రాజేశ్వరి, సత్యవతి, సునీత, మహాలక్ష్మి బాలామణి,కొండమ్మ, జయలక్ష్మి, ఏఎన్‌ఎం పాప్పయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి పూర్ణిమ్మ, పీహెచ్‌ఎన్ భవానీ, వెలుగు ఏపీఎం గాంధీ తదితరులు పాల్గొన్నారు

విరాళాల సేకరణ



అనంతగిరిలో విరాళాలిస్తున్న ఎంపీపీ నీలవేణి



అరకలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

అరకులోయ రూరల్/అనంతగిరి(అరకులోయ రూరల్): ఇటీవల కేరళ రాష్ట్రంలో వాయనడ్ గ్రామంలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు తమ మన వంతు సాయం చేస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర చెప్పారు. ఈ మేరకు పట్టణంలో నాయకులతో కలిసి విరాళాలు సేకరించారు. అనంతగిరిలో జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఆధ్వర్యంలో నాయకులు విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా ఎంపీపీ శెట్టి నీలవేణి విరాళం అందజేశారు. బాధితులను అందరూ ఆదుకోవాలని కోరారు. నాయకులు ఉమామహేశ్వరరావు, కొండలరావు, సర్పంచ్ మొస్య వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అరకులోయ రూరల్: మండలంలో లోతేరు పంచాయతీ పరిధిలో ఇటీవల వివిధ వ్యాధులతో మూగజీవాలు మృతి చెందాయి. దీనిపై ఈనెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన 'వ్యాధులతో మూగజీవాల మృతి' వార్తకు అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా లోతేరు పంచాయతీ వంతలగుడ, శిరోసుగుడ, తోడుబంధ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి శిన్నయ్య ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 291 గొర్రెలు, 185 మేకలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, మేకలు, గొర్రెలకు ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం ఇస్తే తక్షణమే వైద్య సేవలందిస్తామన్నారు. సిబ్బంది చంద్రశేఖర్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



తహసీల్దార్ రాజేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

కొయ్యూరు: ఇటీవల బదిలీపై విజయనగరం వెళ్లిన తహసీల్‌దార్ డి.రాజేశ్వరరావును కొయ్యూరు ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారాం, సిబ్బంది సోమవారం సన్మానించారు. ఎన్నికలకు ముందు విజయనగరం జిల్లా నుంచి కొయ్యూరుకు ఆయను బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కొయ్యూరు: రేవళ్ల పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌పై సర్పంచ్ వెంకటలక్ష్మి సోమవారం ఎంపీడీవో సీతయ్యకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌ను కించపరిచే విధంగా ఎంపీపీ మాట్లాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేసే విషయంలో సర్పంచ్, కార్యదర్శి మధ్య వివాదం చోటు చేసుకుంది.అయితే కార్యదర్శి సర్పంచ్‌ను హేళన చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు. దీనిపై మంగళవారం విచారణ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతయ్య తెలిపారు. సర్పంచ్ పీటా సింహాచలం, నేతలు బుజ్జిబాబు, చక్రరావు, అప్పలరాజు, బషీర్‌ఖాన్, సర్పంచ్ మాకాడ బాలరాజు పాల్గొన్నారు

పీహెచ్‌సీలకు ఇన్వర్టర్ల వితరణ



లాగరాయి పీహెచ్‌సీకు పవర్ ఇన్వర్టర్ అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరిషదేవి

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్‌సీలకు పవర్ ఇన్వర్టర్‌లను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం అందజేశారు. విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తంటికొండలో రైతులతో కలిసి వరినాట్లు వేశారు. లబ్బర్తి గ్రామంలోని పీహెచ్‌సీను సందర్శించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు జ్యోతి, లబ్బర్తి సర్పంచ్ మిరియాల గణలక్ష్మి, ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, నాయకులు భాస్కర్, తాతారావు, కేశవ్, సీడీపీఓ దేవమణి, మెడికల్ ఆఫీసర్లు సుష్మ, ఉషశ్రీ, సరోజ్, యామిని ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



అరకులోయ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, సిబ్బంది



మారేడుమిల్లి కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో వీర కిషోర్ తధితరులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ మొక్కలతో పర్యావరణ పరిరక్షణ ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లు నరికివేతతో పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. అధ్యాపకులు లచ్చన్న, నాగబాబు, విజయలక్ష్మి, కొండబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం ఎంపీడీవో వీర కిషోర్ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మానవ మనుగడకు చెట్లు ఎంత గానో తోహద పడతాయన్నారు, కావున ప్రతి వ్యక్తి మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌వో మమూరి లక్ష్మి, ఏపీవో రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



పెదబయలులో మాట్లాడుతున్న ఎంపీడీవో విగ్గిన్స్



వీఆర్ పురం సంతలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

పెదబయలు/కూనవరం: పెదబయలు, కూనవరం, వీఆర్ పురం ప్రాంతాల్లో ఎంపీడీవో బి.విగ్గిన్స్, తహసీల్దార్ జి.రంగారావు, కూనవరం, వీఆర్ పురం ప్రాంతాల్లో ఎస్ఐ శ్రీనివాసరావులు గంజాయి అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే అనర్థాలన విద్యార్థులకు వివరించారు. మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. వ్యసనాల వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ పులి మనోజ్‌కుమార్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్లు పంపిణీ



వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు, అధికారులు

చింతూరు(వీఆర్ పురం): మండలంలోని ధర్మతాళ్ల గూడెం ప్రాంతానికి చెందిన వరద బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు, దుప్పట్లతో పాటు పలు సామాగ్రి ఉన్న కిట్‌లను గూంజ్ సంస్థ సహకారంతో ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సోమవారం అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి గాంధీ బాబు మాట్లాడుతూ ఇటీవల వరదలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, వారికి తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. తహసీల్దార్ సయ్యద్ ఫాజిల్, ఎంపీడీవో ఫణీంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, సర్పంచ్ నర్సమ్మ, కో–ఆర్డినేటర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

డుంబ్రిగుడ: మండలంలోని ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 15న జరిగే పంద్రా ఆగస్టు వేడుకలో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని తరగతులకు చెందిన విద్యార్థులందరూ ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాలలో జరిగే వివిధ ఆటపాటలతో విద్యార్థుల సందడి నెలకొంది. మండంలోని 11 ఆశ్రమ పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఆటవిడుపు కార్యక్రమలు జరుగుతున్నాయి.

ఎస్సీ సంఘం నాయకుల ర్యాలీ

అరకులోయ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ అరకులోయలో ఎస్సీ సామాజిక వర్గ నాయకులు నిరసన ర్యాలీ చేశారు. ఎస్సీలను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని నాయకులు రత్నంరాజు, చందరరావు, భూపతి, లెనిన్‌రాజు తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.